# హాత్రాభి లాషులు

రాచకొండ రంగనాథశర్మ



"ఏమండీ, యివాళ మాపిన్నీ, జయా వస్తున్నారు."

"ఊ"

"మెయిల్ లో వస్తున్నామని ఉత్తరం వచ్చింది."

"ఊ"

"ఓ సారి బజారెళ్లి వస్తారా."

"ఏం?"

"కాఫీగుండ - పంచదార పట్టు కొస్తారని."

"ఎందుకని?"

"ఇంట్లో నిండుకున్నాయి కనుక."

"అప్పుడే ఐపోయాయా?"

"అందుకేగా తెమ్మన్నది."

చదువుతున్న పేపరు మడచి ప్రక్కన పెట్టి సరోజ ముఖంలోకి చూశాడు.

"వెళ్తారా?"

"సరూ, సంసారం ఆడదాని చేతుల్లో చక్కబడుతుందంటారు."

"అయితే...యిప్పుడేమయిందని."

"ఇంతకంటె యేంకావాలి! నెలకు సరిపోయేలా తెచ్చినవి పదిహేనో తారీకుకే అయిపోయా యంటున్నావ్."

"నేనేం కూర్చుని తినేశానంటారా?"

"ఆ మాట నేననలేదు సరూ."

"మరి....మన ప్రక్కింటి రాజమ్మ గారికి బదులిచ్చాననేగా యీ ఉపన్యాసం."

"ఆ సంగతి నాకు తెలీనే తెలీదు సరూ. అయినా నువ్వెందుకు అప్పలివ్వాలి? అప్పులు చెయ్యాలి? నువ్వెప్పుడయినా అప్పుకెళ్తే యీ రాజమ్మగారేయిచ్చివంపారా? ఆ అలవాట్లు వాళ్లకే లేనప్పుడు-నువ్వు ఆ అలవాటును తగ్గించుకోవాలి."

సరోజకి మాటలు బాధనిపించాయ్.

"ఇంతకూ తప్పంతా నాదేనంటారు."

"ఆ మాటకూడా నేననటంలేదు సరూ. మనం ఓ నిర్ణయానికి కట్టుబడాలి. ఒక ఉద్దేశంతో నిలబడాలి- ఒక్కటాలోచించు; మన కొచ్చే జీతం కాక ప్రతీనెలా పాతికో పరకో యింటి దగ్గర్నుంచి తెప్పించుకోకుండా అవుతుందా? లేదు లేదని బాధపడటం కంటే ఉన్నదాన్ని ఉన్నంతగా తల్చుకొని కమ్మగా కాలక్షేపం చేయటం నేర్చుకోవాలి - అందులో తృప్తి లేదూ!"

"అయితే మా వాళ్లు రావటం మీకిష్టంలేదా?" సూటిగా అడిగింది సరోజ.

"సరూ!"

"అంత యిష్టం లేకపోతే చెప్పేయండి-ఎవర్నీ యీ యింటి గడప త్రొక్కవద్దని ఉత్తరాలు వ్రాసేస్తాను."

"సరూ!"

"మనం వెళ్లేది లేక పోయినా- వాళ్లయినా వస్తున్నారని సంతో షించాల్సింది పోయి...."

"సరూ, ఎవరి సంతోషాలు వాళ్లవి- ఎవరి ఆనందాలు వాళ్లవి-ఒకరి కొకరు అడ్డను కోవటం తెలివితక్కువ- యిప్పుడు మీ వాళ్లొస్తారు-వెళ్తారు, యిక్కడేం కాపురం ఉండిపోరు- దానికి నేనేమన్లేదు-అంత మన అవస రాలు చూసుకోకుండా అప్పులివ్వటం దేనికని అన్నానంతే! సరే. కూరలు కూడా యేమైనా కావాలా" కుర్చీ లోంచి లేచి బట్టల స్టాండు వైపు దారి తీసాడు సుందరం.

యీ మాట తనను హేళన చేయ టానికా అని అనుమానపడింది సరోజ.

"మీ రేం తేవక్కర్లేదు-వచ్చే వాళ్లందరూ మన యింట్లో కాఫీల కోసం....కూరల కోసం రార్లెండి"

"సరూ! నీధోరణే నీదన్నమాట. యిప్పటికైనా నువ్వర్థం చేసుకోలేదా నన్ను! యిలా మనలోమనమే తగవు లాడుకోవట మేమంత మంచిపని కాదు."

సరోజలో ఉక్రోషం బాగా పెరి గింది-ముఖం ఎర్రబారింది-సుందరం గమనించాడు- "సరేలే; యిప్పుడే పావుగంటలో వచ్చేస్తా. యిద్దరంకలిసే స్టేషన్ కెళ్దాం-నువ్వు రెడీగా ఉండు" సంచీ చేత్తో పుచ్చుకొని బయటకు నడిచాడు సుందరం.

సరోజ భర్త వెళ్లిన వైపే చూస్తూ నిల్చుంది - ఐదు నిమిషాల తర్వాత బరువుగా నిట్టూర్చి బాత్‌రూం వైపు నడచింది-

ముఖం కడుక్కొని గదిలోని అద్దం ముందు నిల్చున్న సరోజ ఆలోచనలు కట్టతెగిన ప్రవాహంలా రాసాగాయ్.

"నేనేదో దుబారా చేస్తున్నట్టు ఆయనెందుకు బాధపడి - నన్ను బాధ పెట్టాలి- సంసారమే సంసారం- అప్పులూ - పప్పులూ లేకుండా జరిగేదా? ఆమాత్రం దానికి వన్నెందు కలా నిలదీసి అడగాలి? అయినా మా ఆడవాళ్లంటేనే యీ మగరాయిళ్లకు బొత్తిగా అలుసు-బానిసగా చూస్తారు. ఆటబొమ్మగా ఉపయోగించు కుంటారు-ఛాఛా! పెళ్లి చేసుకొని యీ నరకాన్ననుభవించేకంటే కల కాలం కన్యగా ఉంటే హాయిగా ఉండేది" యీ ఆలోచనల్తో సరోజ కళ్లల్లో నీళ్లు నిలిచాయ్-మనస్సులో మరణశయ్యమీద ఉన్న తన తండ్రి మెదిలాడు-త్యాగం పేరుతో తను పెళ్లికి ఒప్పుకుంది. తండ్రికోసం తనౌనంది-గడియో-క్షణంలోనో తన తండ్రి మృత్యు ముఖంలోకి ప్రవేశించ బోతున్నప్పుడు-పిన్ని తనను బలవంత

పరచినప్పుడు-తన తల్లి దీనంగా తనను యేదో యాచిస్తున్నట్లు కన్పించి నప్పుడు-పరిస్థితుల ఒత్తిడికి తట్టుకో లేక, తన దృష్టిలో మంచి అని అన్పించని పెళ్లికి ఒప్పుకుంది-

"సరోజా! నా కోసం త్యాగం చేసావమ్మా నీ జీవితాన్ని" యివే తండ్రి ఆఖరి మాటలు — కడశ్వాసతో బరువుగా వెలువడిన మాటలు-నిశ్చింతగా కన్ను మూసాడాయన.

ఆ తర్వాత పిన్నితో వెళ్లిపోయింది తను-

పిన్ని తనకు సుందరంతో వివాహం జరిపింది.

తనాశించినదంతా బూడిదయింది-ఒకరి మాటకోసం-తన జీవితాన్నే బలిపెట్టింది తను.

'ఇప్పు డనుభవిస్తున్నా నందుకే' అనుకుంది సరోజ.

"ఏమిటా అనుభవించేది" అద్దం లోని తననీడ తనను వెక్కిరించి నట్లయింది.

"నరకం - నరకం అనుభవిస్తున్నాను" కసిగా అంది సరోజ.

"నీజీవితాన్ని నువ్వే నరకంచేసు కుంటూ నరకం అనుభవిస్తున్నానని బాధెందుకు? గోరంతను కొండంతగా తల్చుకుని దుఃఖపడటంకంటె కొండంత కష్టాన్ని అణువుగా ఆహ్వానించ నేర్చు కోవటంలో తృప్తి లేదూ?"

"లేదు - తృప్తి లేదు - నేనంటేనే పురుగును చూసినట్లు చూస్తారు."

"లేదు, ఆయన్ను నువ్వర్థం చేసుకో లేకపోతున్నావు. అనుక్షణం నీకోసం ఆయన తపించిపోతాడు. నీకనురెప్పల నీడల్లో స్వర్గాన్ని వెదుక్కుంటూ హాయిగాఉండాలని ఆరాటపడుతాడు. పరాకాష్టచెందిన ప్రేమశిఖరాలకు నిర్నాధారంగా చేసుకుని చేరాలని ఉబలాటపడతాడు .... కాని .... నీలో పేరుకుపోయిన ఒకనాటి భావ కరిగి పోలేదు-పైగా నీ అహాన్ని రెచ్చ గొడుతూంది."

"ఏమిటా భావం?"

"పెళ్ళంటే బానిసత్వం అని.... మొక్కగానే తృంచి ఉండాల్సింది. వాతావరణం నీవు పోసుకున్న నారుకు నీరయి మొక్కను మ్రానుగా చేసింది— మించిపోయింది లేదు-యిప్పటికైనా నీ భర్త అభిరుచుల కనుగుణంగా నడుచుకో; అందులో తప్పేమిటి?"

"అలుసై పోవటం నాకిష్టం లేదు."

"పిచ్చిదానా! మంచితో విషాన్ని మ్రింగించగలవు కాని చెడుతో అమృతాన్ని త్రాగించగలవా? అనురాగంతో అతని హృదయాన్ని దోచుకోగలవ్ కాని అహంతో అతన్ని ఒప్పించ

గలవా ? నీ హృదయ వీణకు ఆయన 'శృతి'గా నిలబడకపోతే అపశృతులు తప్పితే హృదయాన్ని కరిగించే సంగీతం ఎలా వస్తుంది ? ''

"ఆయన దంతా అదో రకం — నన్నాయన ప్రేమించటం లేదు — నేనంటేనే ఆయనక్కిట్టదు.''

''సరూ.''

ఉలిక్కి పడింది.

కూరల సంచీతో గుమ్మం దగ్గర నిల్చున్న సుందరాన్ని చూసింది.

''టైమవుతూంది - యింకా తయారవలేదా."

"మీరెళ్లండి. నేను రాలేను."

సుందరం బాధ పడ్డాడు-కోపమూ వచ్చింది.

''ఎందుకని."

''ఒంట్లో బాగా లేదు.''

''ఇప్పటి కిప్పుడే యేం కొంప మునిగిందని ?''

''మునగవల్సింది ఎప్పుడో మునిగింది."

"ఇంతకూ నువ్వు రానసేగా చెప్పేది.''

"ఔను.''

"సరే'' సుందరం విసురుగా వెళ్ళిపోయాడు.

* * *

''ఏమోయ్;సరోజరాలేదా?" బండి దిగుతూనే ప్రశ్నించారు సరస్వతమ్మగారు.

''రాలేదు'' ముక్తసరిగా జవాబిచ్చేసరికి సుందరం ముఖంలోకి చూసింది సరస్వతమ్మగారు.

''ఎందుకు రాలేదు బావా అక్క" మరదలు జయ అడిగింది.

విన్పించుకోనట్లు ఊరుకున్నాడు సుందరం.

''నువ్వురావద్దన్నావా" సూటిగా అడిగింది జయ.

''ఉహుఁ! తనేరానంది తలనొప్పిగా ఉందని.''

లైసెన్సు కూలీ తొందర చేయటంతో సామానుతో అక్కణ్ణుంచి కదలి స్టేషను బయటకు నడచి రిక్షాలో కూర్చున్నారు జయా — సరస్వతమ్మగారు - సుందరం సైకిలెక్కి రిక్షాను అనుసరించాడు.

ఇంటిముందాగిన రిక్షాలోంచి జయ ముందుగానే దిగి 'అక్కా' అంటూ లోపలికి ప్రవేశించింది.

''అక్కా ! అక్కా.''

సరోజకు మెలకువ వచ్చింది. 'ఎంత నిద్రపట్టేసింది' తనలో తనే అనుకుంది.

''తలనొప్పి ఎలా ఉందక్కా.''

జయ ప్రశ్నకు సరోజ ఉలిక్కిపడింది.

"నా కేతలనొప్పి లేదు" చిరాగ్గా అంది.

"మరి బావ అలా చెప్పాడేం? అయినా అలా ఉన్నావేం....ఒంట్లో బాగాలేదా?"

"బాగానే ఉంది, పిన్నేదీ?"

"అమ్మా....?" సరస్వతమ్మగారు రానేవచ్చారు.

"రా, పిన్నీ" ఆహ్వానించింది సరోజ.

"ఏమే తలనొప్పి ఎలాగుంది? అదేం అలా నీరసంగా ఉన్నావ్?"

జయ అక్కణ్ణుంచి కదిలింది.

"ఊరికే పిన్నీ, పడుకుని లేచాగా అందుకేమో."

సుందరం నిట్టూర్చాడు.

సరస్వతమ్మగారు అనిట్టూర్పులోని భావాన్ని పసిగట్టినట్టున్నారు.

"మొహం కడుక్కో సరోజా!" అందామె.

"సరోజా! ముఖం కడుక్కున్నాక కాఫీ పెట్టు."

చెంప ఛెళ్ళుమన్నట్లయింది.

"కాఫీ హా డెక్కడక్కయ్యా" జయ వస్తూనే అడిగింది.

ఆశ్చర్యపోయారంతా! అయితే జయ కాఫీ కలపడానికి సన్నాహాలు చేస్తోందన్నమాట; మనసులోనే అనుకున్నాడు సుందరం.

"ఏమిటా స్వతంత్రం" అన్నట్టుగా జయ ముఖంలోకి చూశారు సరస్వతమ్మగారు.

"ఆ హక్కు నాకుందిలే" కళ్లతోనే జవాబిచ్చింది జయ.

సరోజ తడబడింది – సుందరం చిన్నగా నవ్వుకున్నాడు.

జయతో సరోజ లోపలి కెళ్ళింది. తిరిగి వచ్చి పిన్నిదగ్గర కూర్చుంది.

మరో ఐదు నిముషాల్లో జయ ట్రేలో పెట్టి కాఫీలు తెచ్చి తల్లికీ.... బావకూ........సరోజకూ యిచ్చింది– తనొక గ్లాసు తీసుకుంది – జయ – సుందరం సరస్వతమ్మగారు కాఫీలు పూర్తి చేశారు. సరోజ కాఫీగ్లాసు అలానే ఉంది.

"చల్లారిపోతూంది – వేగం తాగెయ్."

"నేను కాఫీ మానేశా పిన్నీ."

సుందరానికి బాధ కల్గించిదామాట.

"ఎన్నాళ్ళనుంచి."

"అంతా పదిరోజు లౌతుంది."

సుందరాని కంతా అయోమయ మనిపించింది – మందలిద్దా మనుకునే ఊరుకున్నాడు.

సరస్వతమ్మగారు ప్రతీ విషయాన్నీ యేదో అనుమానంతో గమనిస్తూనే ఉన్నారు. అక్కడితో ఆ ప్రసక్తి ఆగిపోయింది. "సరూ" గదిలోకి వెళ్తూ

పిలిచాడు సుందరం. సరోజ తప్పని సరిగా వెళ్ళింది. "చూడు సరూ, నీ వ్యవహారం నాకేం నచ్చలేదు! కాఫీ మా నేశానని అబద్ధాలెందుకు చెప్పావు?"

సరోజ జవాబివ్వలేదు.

"ఇంటికెవరయినా వచ్చినపుడైనా నవ్వుతూండడం నేర్చుకోవాలి. యిలా నా పరువును తీయటంలో నీ ఉద్దేశం యేమిటి?"

దానికీ సరోజ సమాధానం చెప్పలేదు.

"సరే, వెళ్ళు."

గదిలోంచి బయటకు వచ్చి "యిప్పుడే ఓ గంటలో వచ్చేస్తా.... ఆఫీసుకెళ్ళాలి" సరస్వతమ్మగారితో చెప్పి సుందరం బయటకు నడిచాడు.

"ఆదివారం కూడా ఆఫీసేనా?" అనుకున్నారావిడ.

"సరోజా."

సరోజ వచ్చింది — తన ముఖకవళికలను కప్పిపుచ్చుకుంటూ నవ్వటానికి ప్రయత్నించింది సరోజ.

"చూడు సరోజా; ఒకనాడెప్పుడో యీ విధంగా జరుగుతుంటే చూడాల్సి వస్తుందని నాకు తెలుసు."

నిశ్చేష్టురాలయింది సరోజ.

"అంతా నాకు తెల్సులే సరోజా! సుంగరాన్ని నువ్వింకా అర్థం చేసుకోలేదంటే నా కాశ్చర్యంగా ఉంది."

"పిన్నీ" కంఠం వణికింది.

"గతాన్ని త్రవ్వుకుని బాధ పడటం మంచిది కాదు — ఒకనాటి నీ ఆశలు-ఆశయాలు..నీ ఆలోచనలు యీనాడు నీకు సానుభూతి చూపిస్తాయా! తల్లిదండ్రుల చాటున సాగిన పట్టుదలలూ-పంతాలూ యిప్పుడుకూడదవు సరోజా! అసలు నువ్వవన్నీ మర్చిపోవాలి.... మర్చిపోయి తీరాలి...."

"అదికాదు పిన్నీ ......"

"ఏదీకాదు.... నేను చెప్పేది విను. నీ జీవితం ఒక మలుపు తిరిగి మంచి బాటలో పడింది—అది ముళ్ళబాటలో ప్రవేశించకుండా కట్టుదిట్టం చేసుకొనే బాధ్యత నీ చేతుల్లోనే ఉంది. పోనీ ఆయనమాట ప్రకారమే నడుచుకోవటానికి ప్రయత్నించు. అందువల్ల నీ ఆత్మగౌరవానికి నష్టంగాని... నీ మనసుకు కష్టంగాని, నీ అభిమానం దెబ్బతినేదిగాని ఏమీలేదు — అతనౌనన్నది - నువ్వూ ఔనని - కాదంటే కాదని ఒప్పుకోవటంలో తప్పేముంది? ముప్పేముంది? అప్పుడే మీ జీవితాలు చాలా దగ్గర పడతాయ్. మీ హృదయాలు అనురాగలతతో బంధింపబడతాయ్ — అప్పుడు మీ కు సుఖాలెంతో-కష్టాలు కూడా అంతే.."



"నిజంచెప్తా, నేను రికార్డు కొంటానికి రాలేదు! అప్పులాడు కనపడితే ఇక్కడికొచ్చా!"

"లేదు పిన్నీ! ఆయన నన్నర్థం చేసుకోవటానికైనా ప్రయత్నించరు."

"పిచ్చిపిల్లా! నువ్వయినా ఆ ప్రయత్నం చేశావా? నువ్వాయన్ను అర్థం చేసుకొన్ననాడు ఆయన నిన్ను అర్థం చేసుకోవటం అద్దం ముందు ప్రతిబింబమే ఔతుంది—చిన్ని...చిన్ని పట్టుదలలతో హృదయాన్ని కల్మషం చేసుకోవటం మంచిదా? పెద్ద పరుగులు తీయటం మంచిదేనా? అంతెందుకు... నీ స్నేహితురాలు లత లేదూ! ఆమె సంసారం చూస్తుంటే చూసేవాళ్ళకే బాధనిపిస్తుంది – కావచ్చు .... తను ధనవంతుల కుటుంబంలోనిదే. అయితే తన పెళ్ళికాకముందు అలవాటుపడిన జల్సాలకు యీనాడు భర్తను పీడించడం సబువా? భార్యనర్థంచేసుకొని అతనుమాత్రం యెక్కణ్ణుంచి యేం తెచ్చిపెట్టగలడు? భర్త నామె అర్థం చేసుకుని అనుసరించ గల్గితే వాళ్ళ జీవితం పువ్వుల బాటవదూ, చెప్పు సరోజా" సరస్వతమ్మగారు సరోజ ముఖంలోకి చూశారు. సరోజలో

యే మార్పూ వస్తున్నట్టు కన్పించ లేదు, అన్పించలేదు.

"పిన్నీ ! నీతోపాటు నేనూవచ్చి ఓ నెల్లాళ్లుంటాను"

ఆలోచించారు సరస్వతమ్మగారు... అదీ ఒకందుకు మంచిదే అను కున్నారు....అప్పటికీ....

"సుందరాన్నడిగావా ?"

"ఎందుకడగాలి ?" అన్నట్లు చూసింది నిర్లక్ష్యంగా...''లేదు...నువ్వే అడుగు.''

మాటల్లో సుందరం వచ్చి కూర్చున్నాడు.

"ఏమోయ్, సుందరం!''

''ఏమండీ?''

''సరోజ నాతోపాటు ఒక నెల్లాళ్లుం టుంది - తీసుకెళ్లనా?"

"మీయిష్టం''

సరోజ ఆశ్చర్యపడింది-అభిమాన పడింది కూడా.

''ఎల్లుండి వెళ్తున్నాం.''

''సరే'' సుందరం లేచి బట్టలు మార్చుకుని స్నానం చెయ్యడానికి వెళ్లాడు నూతిదగ్గరకు-

''జయ సంగీతం నేర్చుకుంటోంది తెలుసా"

సరోజ విన్పించుకోలేదు.

''సరోజా''

"ఏం పిన్నీ" తలెత్తి పిన్నివైపు చూసింది సరోజ.

''జయ సంగీతం నేర్చుకుంటూంది తెలుసా"

''అలాగా?"

"ఔనక్కా" స్నేహితురాళ్ల యిళ్లన్నీ చక్కబెట్టుకొని వీధిలోంచి వస్తూ అంది జయ.

''జయా! నీ పాట అక్కకుగూడా విన్పిస్తావా ?"

''ఓయస్‌గా'' అంది కూర్చుంటూ,

''నను దయగనవేర గోపాల బాలా
ముదమున నినుజేరి ఎంతెంతో వేడా
॥నను॥
చిలిపి.... చిలిపి.... అలుకలతోడా
రాధ నీతోనే....జగడాలుఆడా
చివికి.... చివికి.... పెనువాన ఆయే
చివరకు ఆరాధ శరణనుట.... నీ....
మాయే ॥నను॥"

''జయా"

పాటఆగిపోయింది.

సరోజ అక్కణ్నుంచి లేచి వెళ్లి పోయింది

సరస్వతమ్మగారు నవ్వుకున్నారు.

జయ కిదేం అర్థం కాక అయోమయంగా చూస్తోంది.

* * *

సరస్వతమ్మగారు జయ ఒక రిక్షాలోను-సుందరం-సరోజ మరో రిక్షా

లోనూ కూర్చుని స్టేషన్‌కు వెళ్ళారు-దారిలో ఎవ్వరూ ఏమీ మాట్లాడుకో లేదు-ముగ్గురికీ సుందరమే టిక్కట్లు కొని యివ్వాలనుకొన్నాడు.

''అమ్మ టిక్కట్లు కొనమంది'' పది రూపాయలనోటు అందించింది జయ.

మాట్లాడకుండా తీసుకొని.... టిక్కెట్లుకొని.... టిక్కట్లూ మిగిలిన చిల్లర జయచేతిలో ఉంచాడు.

ట్రయినొచ్చి ప్లాట్‌ఫారం దగ్గర ఆగింది.

సరోజ-సరస్వతమ్మగారు లోపలికెళ్లి కూర్చున్నారు.

''ఉత్తరాలు వ్రాస్తావా బావా ?''

''అలాగే జయా''

సరోజదృష్టిని మరోవైపు మరల్చుకుంది.

మరో ఐదు నిముషాల్లో రైలు కదిలింది.

''వస్తానోయ్."

"వస్తాబావా."

సరోజ యేమి మాట్లాడలేదు.

రైలు వెళ్ళిపోయింది.

సుందరం బరువుగా అడుగులు వేసుకుంటో యింటిముఖం పట్టాడు.

*   *   *

పదిరోజులైంది-సరోజ ఒక్క ఉత్తరం అయినా వ్రాయలేదు-జయ రెండుత్తరాలు వ్రాసింది-సుందరం జయ కే జవాబిచ్చాడు....అందులో వేట్లోనూ సరోజ ప్రశక్తి లేదు.

*   *   *

"ఏం సరోజా! సుందరం ఏమయినా ఉత్తరాలు వ్రాసాడా ?''

''లేదు."

''నువ్వయినా వ్రాసావా."

''ఉహుఁ:"

''వ్రాయలేకపోయావా?"

''వ్రాయలేదు."

''వ్రాస్తావా:"

''ఊహుఁ :"

"అమ్మా! బావదగ్గర్నుంచి ఉత్తరం వచ్చింది..."

''అక్కయ్యకా ?"

''కాదు. నాకు."

సరోజ అక్కణ్ణుంచి లేచి వెళ్ళిపోయింది.

"బావకు ప్రమోషన్ వచ్చిందట"

''అలాగా- వెళ్ళి అక్కతో చెప్పు."

''అక్కా..అక్కా.."గదిలోకి పరుగెట్టింది.

''ఏం జయా."

''బావకు ప్రమోషన్ వచ్చిందట."

సరోజ మౌనంగా ఊరుకుంది.

''ఈ ఊర్లో ఆఫీసులోనే వేసారట కూడా.''

''వేయించుకున్నారేమో"

జయకు అక్క వ్యవహారమేమీ

నచ్చలేదు-ఎగిరి గంతేస్తుందనుకున్న అక్క చప్పగా, నిర్లక్ష్యంగా మాట్లాడే సరికి జయ సంతోషంఅంతా 'చప్పన' చల్లారిపోయింది."

"అమ్మకి విషయం చెప్తాను" గొణిగింది జయ.

"ఏ విషయం" తీక్షణంగా చూసింది సరోజ.

"బావకి ఊరువేసినట్టు" వెంటనే వెళ్ళిపోయింది జయ.

సరోజ నిలబడి అలాచూస్తూ ఉండి పోయింది.

జయ తల్లితో చెప్పింది-సరస్వతమ్మ గారు సంబర పడ్డారు.

పది రోజుల తర్వాత సరోజపేరన ఒక పెద్ద కవరొచ్చింది-జయ పట్టుకెళ్ళి సరోజ కిచ్చింది-సరోజ చేతిలోకి తీసుకుంది. జయ అక్కణ్ణుంచి చల్లగా జారుకుంది.

సరోజ సంకోచించింది చదవటానికి—చదవకూడదనుకుంది-కాని పిన్ని అడిగితే....సరే....చదివినంతలో పోయిందేముంది అనుకుని కవరు చింపింది — మంచంమీద కూర్చుని చదవటాని కుపక్రమించింది.

"సరూ."

ఉలిక్కిపడింది. "యిప్పటికి జ్ఞాపకానికి వచ్చానన్నమాట" అనుకుంది.

"జీవితములో అడుగడుగునా ఎదురుపడే సమస్యల్ని మూడో వ్యక్తికి అవకాశం యివ్వకుండా మనలో మనమే పరిష్కరించుకోవటం శ్రేయస్కరం-అందుకు చదువొక్కటే చాలదు సరూ! సంస్కారంకావాలి-ఎదుటవ్యక్తిని అర్థంచేసుకొనే దూరదృష్టి అవసరం. పట్టుదలల పర్యవసానాలు యెంత తీవ్రంగా ఉంటాయో అర్థమయిందా యిప్పటికైనా! యింతకూ నేనేమన్నానని నీకింత పట్టుదల-అది యిద్దరికీ మంచిది కాదు. నిజంగా నువ్వక్కడ ఎంత బాధపడుతున్నావో నేను నీగురించీ అంతకు రెట్టింపు 'క్షోభ' అనుభవిస్తున్నాను."

ఈ మాటకు సరోజ ఆశ్చర్యపోయింది. తిరిగి చదవటంలో నిమగ్నురాలై యింది.

"పోనీ లే, జరిగిందేదో జరిగి పోయింది—నేరం ఎవరు చేసినా శిక్షార్హు లే. అలాగే తప్పెవరుచేసినా క్షమార్హు లే—నా దే తప్పని నువ్వు భావిస్తే నన్ను క్షమించగలవా?"

సరోజ దుఃఖం పొర్లుకొచ్చింది. కళ్ళొత్తుకుంది.

"చివరిమాట సరూ! నువ్వెలాటి పరిస్థితుల్లో ఉంటావో నే నూహించిన దాన్ని ఋజువు చేస్తున్న ఈ ఉత్తరాలు చదువు."

క్రింద నాలుగు ఉత్తరాల్లోంచి కట్ చేసిన ముక్కలున్నాయ్. ఒకొ టొకటి చదివింది సరోజ.

"బావా! అక్క నీకోసం-అహో రాత్రాలు ఎదురు చూస్తూంది-ప్రతి క్షణం నీగురించే ఆలోచిస్తుంది. కనీసం ఒక్క ఉత్తరం అయినా వ్రాయిబావా"

"బావా! అక్క నీ గురించి ఎంతగా బాధపడ్తోందని — ఎందుకు వచ్చేశానా అని కుమిలిపోతూంది. తప్పు తనదేనని-తనంతట తాను నీ దగ్గరకు రావటానికి ముఖం చెల్లటం లేదని పిన్నితో చెప్పి యేడ్చిందోనాడు తెల్సా!"

"సుందరానికి - సరోజ చిన్నపిల్ల-గారాబంగా పెరిగింది కూడా-పోతే ఆమెను అంటి పెట్టుకున్న పంతాలూ-పట్టుదలలూ - కాల గమనంలో సర్దుకు పోతాయి — నీ మంచితనం నాకు తెల్సు - సరోజ ప్రవర్తన నిన్నెంతగా కష్టపెట్టిందో నేనర్థం చేసుకున్నాను - యేది యేమయినా మీ మధ్య మూడో వ్యక్తి ప్రవేశించి మీ సమస్యల్ని పరిష్కరించటం అనేది గౌరవం కాదు" — సరస్వతమ్మ.

"బావా! ఆడదాన్ని అర్థం చేసుకో లేవు నువ్వు-అయినా నీకు ఫర్వాలేదు-ఎందుకంటా వేమో? నువ్వు మగాడివి! ఏం చేసినా చెల్లుతుంది. నేను నీకు చెప్పవల్సిందాన్ని కాదు బావా! ఆలోచించు — అక్క పరిస్థితిని అర్థం చేసుకుంటే సంతోషిస్తాము-నీ గురించి ఊహించగల శక్తి మాకుంది. "జయ."

"ఇదిసంగతి సరోజా! మన పట్టుదల లెంతవరకూ దారితీసాయో ఆలోచించు-నువ్వెలా ఆరోజు వెళ్తున్నప్పుడు ప్రవర్తించినా..యీ యింటితలుపుల్తో పాటు .... నా హృదయ కవాటాలు కూడా నీ ప్రవేశానికి ఎప్పుడూ తెరిచే ఉంటాయ్..ఆలోచించు-నీ సుందరం."

సరోజ వెక్కి... వెక్కి యేడ్చింది. తన తప్పుకు కుమిలిపోయింది—అలాగే నిద్రపోయింది.

రెండు గంటలకు మెలకువ వచ్చింది. సరస్వతమ్మగారు ఎదురుగా నిల్చున్నారు. "సరోజా — సినిమా కొస్తావా."

"లేదు పిన్నీ; మూడుగంటల బండి కెళ్తున్నాను."

ఆవిడ ఆశ్చర్యపడ లేదు. 'సరే' అన్నారు.

జయ వస్తూనే తల్లి ముఖంలోకి గర్వంగా చూసింది—సరస్వతమ్మగారు ఆనందంగా గది బయటకు వచ్చారు.

*   *   *

సరోజ ట్రయిన్ దిగి రిక్షాలో యింటికి వెళ్ళింది. సరోజను చూడగానే సుందరం నిర్ఘాంతపోయాడు.

"వచ్చేవా సరూ" అనలేకుండా ఉండలేకపోయాడు.

సరోజ రిక్షావాడికి డబ్బులిచ్చి పంపేసింది - సామాను లోపల పెట్టి.... సుందరం దగ్గరకు వచ్చింది.

"ఏమండీ; నన్ను క్షమించగలరా."

ఆశ్చర్యపోయాడు.

"తప్పు మీదికాదు - నాదే.. క్షమించేననండి" తల దించుకుంది సరోజ.

"నీదని ఎవరన్నారు."

"పోనీ తప్పుమీదేనని - క్షమించమని ఉత్తరం వ్రాయటం బాగుందా?" దానికి మరింతగా ఆశ్చర్యపడ్డాడు సుందరం - అయోమయంలోనూ పడ్డాడు.

"తెలీనట్లు అలా చూస్తారేం - యిదిగో - ఉత్తరం" అందించింది. అందుకుని తొందర తొందరగా చదివాడు. రకరకాలుగా మార్తున్న రంగుల్ని గమనిస్తూనే ఉంది సరోజ.

'ఏమంటారు' అన్నట్లు భర్తవైపు చూసింది.

"ఇంత నాటకం జరిగిందన్నమాట."

"ఏమిటది?" ఆశ్చర్యపడింది సరోజ.

"సరూ! జీవితాలకు వెలుగుబాట చూపించేవాళ్లు .... మనుష్యుల్ని మరామ్మతు చేయడానికి.... కంకణం కట్టుకునేవాళ్లు.... లోకంలో చాలా తక్కువమంది ఉంటారు - వాళ్లు ఎంతో మందికి.... యెన్నో కుటుంబాలవారికి దైవసమానులు.... హితాభిలాషులు."

అర్థంకానట్టు చూసింది సరోజ.

"నిజానికి ఉత్తరాలసంగతి నాకేమీ తెలీదు సరూ."

'ఆ' అప్రయత్నంగా అంది సరోజ.

"ఔను - మీ పిన్ని.... జయ కలిసి ఆడిన నాటకం ........ నా దస్తూరీ నువ్వెప్పుడూ చూడలేదు.. నేనెప్పుడూ నీకు ఉత్తరం అయినా వ్రాయలేదు - ఆలా జరిగుంటే నీ కనుమానం కల్గేది" సరోజ కళ్లల్లోకి చూసాడు సుందరం..

సరోజ కళ్లు కాంతితో మెరిసాయ్ - ఆ హితాభిలాషుల్ని తల్చుకుంటూ భర్తవడిలో వాలిపోయింది.

